Mana Telangana        Dt-26/11/17.

# మెట్రో ప్రారంభంతోనే రికార్డు





- ఒకేసారి 30కిలోమీటర్లు దేశంలోనే తొలిసారి
- 28న లాంఛనంగా ప్రారంభం
- 29న ప్రజలకు అందుబాటులోకి..
- మంత్రులతో కలిసి మెట్రోలో కెటిఆర్ ప్రయాణం

మన తెలంగాణ/సిటీబ్యూరో : హైదరాబాద్ మెట్రోరైల్ ప్రారంభోత్సవంతోనే రికార్డు సృష్టిస్తుందని ఐటీ, పురపాలక శాఖమంత్రి కె.టి.రామారావు అన్నారు. దేశంలో 30 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను ఒకేసారి ప్రారంభోత్సవం చేయడం ఇదే ప్రథమమని అన్నారు. దీని ద్వారా సరికొత్త రికార్డును హైదరాబాద్ మెట్రోరైల్ సొంతం చేసుకుంటుందన్నారు. శనివారం ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో కలిసి కెటిఆర్ మెట్రోరైల్లో ఉప్పల్ స్టేషన్ నుంచి మెట్టుగూడ స్టేషన్‌ల మధ్య అటు ఇటు ప్రయాణించారు. 'టి సవారీ' పేరిట స్మార్ట్ కార్డు, స్వచ్ఛ మెట్రో పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న మధ్యాహ్నం 2.15 నిమిషాలకు ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావులు లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 29 నుంచి మొదటి నాలుగు నెలలు మెట్రో రైలు సర్వీసులు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రైళ్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. అనంతరం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిపిపి(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) మోడ్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అన్నారు. హైదరాబాద్ ప్రజలు మెట్రోను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. హెచ్ఎంఆర్, ఎల్ అండ్ టి అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసినందునే అనుకున్న సమయానికి మెట్రో పూర్తి అయిందన్నారు. ప్రారంభంలో ప్రతి రైలుకు మూడు బోగీలు ఉంటాయని, వీటిలో ఒకేసారి వెయ్యిమంది ప్రయాణించవచ్చన్నారు. భవిష్యత్‌లో ప్రతి రైలుకు బోగీల సంఖ్యను ఆరుకు పెంచుతామని వెల్లడించారు. మెట్రోరైలు ప్రారంభంలో వచ్చే సమస్యల పట్ల మీడియా సహకరించాలని కోరారు. మెట్రో వివరాలతో త్వరలోనే టి సవారీ పేరుతో ప్రత్యేక యాప్ తీసుకువస్తున్నట్లు చెప్పారు. మెట్రోరైలు రెండవ దశ పనులు కూడా ప్రారంభించామని కెటిఆర్ వెల్లడించారు.ఆర్‌టిసి ద్వారా కాలనీలకు వెళ్లేందుకు ఫీడర్ సర్వీసులు నిర్వహిస్తామన్నారు. మహేంద్ర మహేంద్ర కంపెనీ బ్యాటరీ వాహనాలను నడిపేందుకు ఒప్పందం చేసుకున్నారు. బై సైకిల్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మెట్రోరైలులో ప్రయాణించిన వారిలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, పి.మహేందర్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, టి.పద్మారావు, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటి మేయర్ బాబా ఫసియోద్దీన్, ఎంపిలు బండారు దత్తాత్రేయ, జితేందర్‌రెడ్డి, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు జి.సాయన్న, చింతల రామచంద్రారెడ్డి, కనకారెడ్డి, ఎన్‌వివిఎస్. ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రభాకర్ పాల్గొన్నారు.

## అందుబాటులో 57 రైళ్లు...

ప్రస్తుతం అందుబాటులో 57 రైళ్లు ఉన్నాయని కెటిఆర్ చెప్పారు. ఒక్కోరైలులో మూడు కోచ్‌లు ఉన్నాయన్నారు. ఈ మూడు కోచ్‌లలో ఏకకాలంలో వెయ్యిమంది ప్రయాణించొచ్చు అని తెలిపారు. భవిష్యత్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మూడు నుంచి ఆరు కోచ్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. ఆరు కోచ్‌లలో రెండు వేలమంది ప్రయాణించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

## ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దు...

ఢిల్లీలో కాలుష్యం కారణంగా పాఠశాలకు సెలవులు ఇచ్చేశారని, అలాంటి హైదరాబాద్‌లో రావొద్దని అన్నారు. కాలుష్యం తగ్గించేందుకు మెట్రోరైల్ ఉపకరిస్తుందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి వస్తాయన్నారు.

## ఎఫ్‌ఓబిలుగా కాంకోర్స్ వరకు వినియోగించుకోవచ్చు...

కాంకోర్స్(స్టేషన్ మొదటి అంతస్తు) వరకు ఎవరైన రావొచ్చు పోవచ్చని కెటిఆర్ తెలిపారు. ఇక్కడ ఎలాంటి రుసుం వసూలు చేయారని అన్నారు. ప్లాట్‌ఫామ్ పైకి వెళ్లితేనే టిక్కెట్టు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కాంకోర్స్ వరకు పైకి వెళ్లేందుకు కిందకు వచ్చేందుకు నాలుగు వైపులా దారులు ఉంటాయని అన్నారు. కాంకోర్స్‌లో షాపులు, దుకాణాలు ఉంటాయన్నారు. అయితే ఈ కాంకోర్స్‌ను రోడ్డు దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు(ఎఫ్‌ఓబి)లుగా కూడా వినియోగించుకోవచ్చన్నారు. మెట్రోరైల్ రూపంలో 66 ఎఫ్‌ఓబిలు అందుబాటులోకి వచ్చాయన్నారు.



పార్కింగ్‌కు స్థలాలు

ప్రస్తుతం ప్రారంభిస్తున్న 30 కిలోమీటర్ల పరిధిలో 24 స్టేషన్ల దగ్గర పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేస్తామని కెటిఆర్ అన్నారు. టూ వీల్లర్, ఫోర్ వీల్లర్ వాహనాలను పార్కింగ్ చేసుకునే విధంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొన్ని స్టేషన్ల వద్ద స్కైవాక్స్ కూడా నిర్మిస్తామన్నారు. ఈ స్కైవాక్స్‌ను షాపింగ్‌మాల్స్, మల్టీప్లెక్స్‌లు, స్టేడియంలు, ఐటి సంస్థల వరకు నిర్మిస్తామన్నారు.